క్లుప్తంగా

ఘనంగా ఎమ్మెల్యే సౌమ్య బర్త్‌డే వేడుకలు



నందిగామటౌన్: ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని ఎమ్మెల్యే సౌమ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే తొలుత తన తండ్రి తంగిరాల ప్రభాకరరావు ఘాట్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి జన్మదిన కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నాయకులు కోట వీరబాబు, యేచూరు రాము, లక్ష్మీనారాయణ, శ్రీనివాసాచారి, వీరంకి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



నందిగామటౌన్: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగులకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రమణబాబు తెలిపారు. స్థానిక రామన్నపేట రోడ్డులో చేపడుతున్న తాత్కాలిక డ్రైనేజీ ఏర్పాటు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ లేకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోందన్నారు. దీంతో సమస్యను పరిష్కరించేందుకు తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవిష్యత్‌లో సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరిస్తామని వివరించారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



కంచికచర్ల : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర జై భీమ్ మహిళా సంఘ అధ్యక్షురాలు దియ్యాల జోజిమేరి శనివారం కంచికచర్ల ఎంపీపీ స్కూల్‌లోని విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పాఠశాలకు అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. జోజిమేరి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ జయంతి రోజున పాఠశాలలకు సెలవు ప్రకటించినందున ఈరోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాశం మేరిమ్మ, గుడిబండ్ల ఈశ్వరి, మీసాల జ్ఞాన సుందరి, కలతోటి సునీత, బర్రె బుజ్జి, దగ్గుపాటి అక్కమ్మ, యాదాల సంధ్య, బెజ్జం జాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

హనుమత్ విజయోత్సవం



కంచికచర్ల: మండలంలోని పరిటాల జాతీయ రహదారి సమీపంలో కొలువై ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం విజయోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకారం చేశారు. ఆలయంలో భక్తులు హనుమాన్ చాలీసా పఠనం చేశారు. స్వామి వారికి మహన్యాసపూర్వక అభిషేకాలు, నీరాజన మంత్ర పుష్పములు, అష్టోత్తర పూజలు చేశారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు



జగ్గయ్యపేటఅర్బన్: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ (2ఎన్‌టీ50) లెవెల్ పరీక్షలలో జగ్గయ్యపేటకు చెందిన శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచి బహుమతులు సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులు శనివారం స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యను కలువగా ఆయన వారిని అభినందించారు. శ్రీచైతన్య ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ వినోద్, ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, కౌసల్యాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పేట్రేగిపోతున్న మట్టి మాఫియా

- ఎన్నెస్పీ కాల్వ కట్టను తవ్వుతున్న వైనం
- ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలింపు
- కాల్వ వైపు కన్నెత్తి చూడని అధికారులు
- ఆందోళనలో అన్నదాతలు

వీరులపాడు: అక్రమార్జనకు కాదేదీ అనర్హం అన్న చందంగా అక్రమార్కులు ప్రకృతి సంపద కొల్లగొడుతున్నారు. లక్షలాది రూపాయలను స్వాహా చేస్తున్నారు. ఇప్పటికే ఇసుక మాఫియా విజృంభిస్తుండగా, కొత్తగా మట్టి మాఫియా సైతం యథేచ్ఛగా మట్టిని తరలిస్తోంది. ఇలా అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారికి అధికారపార్టీ అండదండలు ఉండటంతో మరింత రెచ్చిపోతున్నారు.

రాత్రి వేళల్లో మట్టి తవ్వకాలు..

మండలంలోని అల్లూరు గ్రామశివారులో ఎన్నెస్పీ(నాగార్జునసాగర్) కాల్వ కట్టను మట్టి మాఫియా కబళిస్తోంది. రాత్రివేళల్లో మట్టి తవ్వకాలు సాగిస్తూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ.1000 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రెండురోజులుగా ఎన్నెస్పీ కాల్వ కట్టను తవ్వుతున్నప్పటికీ ఎన్ఎస్పీతోపాటు ఆయాశాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. మట్టి తరలించే వారు అధికార పార్టీ నాయకులుగా చెలామణి అవుతుండటంతో అధికారులు సైతం పల్లెత్తు మాట అనలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



అక్రమార్కుల మట్టి తరలింపుతో అల్లూరు గ్రామశివారులో ఎన్నెస్పీ కాల్వ పరిస్థితి ఇది

ఆందోళనలో రైతులు..

అక్రమార్కులు తమ స్వలాభం కోసం ఎన్నెస్పీ కాల్వ కట్టను తవ్వి మట్టిని తరలిస్తుండటంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాల్వ కట్టలు పటిష్టంగా ఉంటేనే వర్షాకాలంలో వచ్చేవర్షాలతోపాటు ఎగువ నుంచి వచ్చే వరద నీటి ఉధృతిని కాల్వకట్టలు తట్టుకుంటాయని, లేని పక్షంలో భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు, వరదలకు కట్టలు తెగి పంట పొలాలు నీట మునుగుతుండగా, ఇక మట్టి తవ్వకాల కారణంగా కట్టలు బలహీనపడుతుండటంతో రానున్న వర్షాకాలంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతుందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి కాల్వ కట్టను తవ్వి మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్న వారిపై కఠినచర్యలు తీసుకోవటంతోపాటు కాల్వ కట్టను పటిష్ఠ పరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..


సాగర్ కాల్వ కట్టను తవ్వి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఈ విషయంపై వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం.

–మొహిద్దీన్, ఎన్నెస్పీ ఎస్ఈ

తిరుమలగిరి వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ భరద్వాజ్, ఏసీ వరప్రసాద్



స్వామివారి కల్యాణోత్సవానికి శ్రీవారి నామాలు, శంఖు అలంకరణలో కొబ్బరి బోండాలు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, పలు రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణలు, నిత్యహోమం, బలిహరణతోపాటు ఎదురుకోలోత్సవం,తదితర కార్యక్రమాలను ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు, పరాంకుశం వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కొండ కింద ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఆలయ చైర్మన్ భరద్వాజ్, ఏసీ వరప్రసాద్ ప్రారంభించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మహోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో స్వామి వారి కొండ రంగురంగుల లైట్లతో కాంతులీనుతుంది. అర్చకులు కొండపైన భూదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కళ్యాణ మహోత్సవాల సందర్భంగా జగ్గయ్యపేటకు చెందిన యామిని కొబ్బరిబోండాలపై ప్రత్యేకంగా తయారు చేసిన స్వామివారి నామాలు, శంఖు, శ్రీచక్రంను అర్చకులకు అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం

కంచికచర్ల: వస్త్రవ్యాపారి మండల వెంకటేశ్వరరావు(రోశయ్య)ఆరో వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు సుధాకర్ స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతిరోజు పాదచారులకు మినరల్ కూలింగ్‌వాటర్‌ను పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

నందిగామరూరల్: భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సమితి కన్వీనర్ వాసుదేవరావు తెలిపారు. నేత్రాలయ కంటి వైద్యశాల సౌజన్యంతో సత్యసాయి సేవా మందిరంలో వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

15న నందిగామలో ఉచిత వైద్యశిబిరం...

నందిగామరూరల్: ఆర్యవైశ్య సంఘం, వేదాన్ష్ పాలీక్లినిక్ ఆధ్వర్యంలో ఈనెల 15న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్యాంప్ చైర్మన్ మారం అమరయ్య శనివారం తెలిపారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి రోడ్డులోని వేదాన్ష్ పాలీక్లినిక్‌లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గడ్డి పెంపకం కేంద్రాల పరిశీలన

జగ్గయ్యపేట: రైతులు గడ్డిని పెంచాలని ఉపాధి హామీ పథకం రాష్ట్ర అడిషనల్ కమిషనర్ శివప్రసాద్ సూచించారు. మండలంలోని కెఅగ్రహారం, వేదాద్రి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేసిన గోశాలతోపాటు గడ్డి పెంపకం కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా పశుగ్రాసాల సాగుకు ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. అర ఎకరంలో గడ్డి పెంచేదుకు ప్రభుత్వం రూ. 33వేలు ఆర్థికసాయంగా అందిస్తుందన్నారు. 10 సెంట్ల నుంచి 50 సెంట్లలో గడ్డి పెంచేందుకు ఆసక్తి ఉన్నవారు ఈ పథకం కింద లబ్ధిపొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ శివరామ్‌ప్రసాద్, జిల్లా పశు సంవర్థక శాఖ జేడీ హనుమంతరావు, డ్వామా పీడీ రాము, ఏపీఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కె.అగ్రహారంలో గడ్డి పెంపకం చేనును పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ శివప్రసాద్

ఆర్టీసీ డిపో ఎదుట నిరసన

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు శనివారం డిపో గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ తమ మొండి వైఖరిని విడనాడాలని నినాదాలు చేశారు. అక్రమ ఓడీలు, చార్ట్ బుకింగ్ వద్ద అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. కొత్త రూట్‌లు తీసుకురావాల్సింది పోయి, ఉన్న సర్వీసులను తొలగించడానికి డిపో మేనేజర్ అవలంబిస్తున్న చర్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. సమస్యలను ఉన్నతాధికారులకు పలుమార్లు తెలియజేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ధర్నాకు దిగినట్లు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు కల్యాణం కృష్ణారావు, ఎ.ఆనంద్, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



పేట డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, కార్మికులు

ప్రత్యేక పూజలు



గరుడాచలం(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వీరనారసింహస్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారికి నిత్య హోమం, సహస్త నామార్చన, ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివార్లకు శనివారం పంచామృత అభిషేకాలు, నారాయణ అష్టాకరి హోమం నిర్వహించారు. పరాంకుశం నారాయణాచార్యులు, బాలకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో నాగ విగ్రహ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ చిన ముత్తేవి హరిదుర్గానాగేశ్వరరావు, వంశపారంపర్య ధర్మకర్త కొమరగిరి రఘురామారావు, భక్తులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన



పైదూరుపాడులో ధాన్యం రాసుల వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

పైదూరుపాడు(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. శనివారం పైదూరుపాడు గ్రామంలో రంగినేని నాగేశ్వరరావు(బాబు), కాగితపు వెంకటేశ్వరరావు, జూలపల్లి వెంకటేశ్వరరావు, పెయ్యల వెంకటేశ్వరరావు పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం రాసుల వద్ద రైతులతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సంయుక్తంగా ఆందోళన చేశారు. పైదూరుపాడు సర్పంచి వేమూరి సీతారామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని చెప్పడమే తప్ప ఈ ప్రాంతంలో ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని పాలకులు గ్రామాల్లో ప్రచారం చేయడమే తప్ప చర్యలు శూన్యమని చెప్పారు. దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు.

రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయకపోతే నల్లకుంట వద్ద హైవేపై రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బయ్యారపు రవికిశోర్, ఉప సర్పంచి తాళ్ళూరి నరసింహారావు, డొక్కా వెంకటరత్నం, రంగినేని చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముచ్చింతాలలో బెల్టుషాపుల జోరు



ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): మండలంలోని ముచ్చింతాల చిన్న గ్రామం. ఒకనాడు గ్రామంలో మద్యం అనేది లేకుండా ఆదర్శవంతంగా ఉండేది...నేడు ఎక్కడ చూసినా బెల్ట్ షాప్‌లు దర్శనమిస్తున్నాయి. 2008లో మద్యం అమ్మకాలు వ్యతిరేకిస్తూ గ్రామంలోని యువకులు, మహిళలు ఉద్యమం చేసి మద్యం విక్రయాలు లేకుండా చేశారు. దీంతో నాడు రాష్ట్రంలోనే ఒక ఆదర్శవంతమైన గ్రామంగా నిలిచింది. మద్యం అలవాటు ఉన్న గ్రామస్తులు మద్యం కోసం పక్క గ్రామాలకు వచ్చి మద్యం తాగాల్సిన పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రస్తుతం గ్రామంలో బెల్టుషాప్‌లు జోరు ఎక్కువైందని గ్రామస్తులు అంటున్నారు. చిన్న గ్రామంలో కూడా 10వరకు బెల్ట్‌షాప్‌లు ఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. కొంతమంది వ్యక్తులు తమ ఇళ్లనే బెల్టుషాపులుగా మార్చి జోరుగా మద్యం విక్రయాలు చేస్తుండటంతో గ్రామంలోని యువతతోపాటు అన్నివర్గాల ప్రజలు మద్యానికి బానిసలై ఆరోగ్యాలు చెడగొట్టుకుంటున్నారని చెబుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం విక్రయాలు సాగుతున్నాయని మహిళలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా ఎక్సైజ్‌శాఖ అధికారులు స్పందించి బెల్టుషాపులను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులతో వాగ్దేవి కళాశాల యాజమాన్యం

జగ్గయ్యపేట అర్బన్: ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేష్ తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో కె.శ్రీరమ్య 465/470 మార్కులు సాధించగా, బైపీసీలో రమ్య 426/440 మార్కులు, సీఈసీలో ఆనందపాల్ 439/500మార్కులు సాధించారన్నారు. సెకండియర్ ఇంటర్ ఎంపీసీలో రోహిత్ 987/1000 మార్కులు, బైపీసీ విభాగంలో సత్తార్ 960/1000 మార్కులు, సీఈసీలో నటరాజ్ 955/1000 మార్కులు సాధించారని వివరించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు కరస్పాండెంట్ సరిత సత్కరించి అభినందనలు తెలియజేశారు.

నందిగామలో...

నందిగామరూరల్: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని శ్రీఅక్షర కళాశాల చైర్మన్ గడుపూడి శ్రీరామ్ శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో దాట్ల అక్షిత, లక్ష్మీగణేష్ 475మార్కులకుగాను 465మార్కులు సాధించినట్లు తెలిపారు. బైపీసీ గ్రూపులో శీలం దీపిక 440 మార్కులకుగాను 435మార్కులు సాధించిందన్నారు. ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో తన్నేడి నిత్యశ్రీ 1000మార్కులకుగాను 988సాధించగా, బైపీసీలో సిరియాల రేవతి 985మార్కులు సాధించి టౌన్ టాపర్లుగా నిలిచినట్లు తెలిపారు. విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించేలా విద్యాబోధన అందించినట్లు వివరించారు. అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను కళాశాల చైర్మన్ శ్రీరామ్, కరస్పాండెంట్ కాసరగడ్డ కిరణ్, అధ్యాపకులు అభినందించారు.

వైభవంగా సత్యమ్మ అమ్మవారి రథోత్సవం



అమ్మవారి విగ్రహాన్ని రథంపైకి తీసుకువస్తున్న ఏసీపీ తిలక్, భక్తులు



సత్యమ్మ అమ్మవారి రథోత్సవం

నందిగామ రూరల్: మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మహోత్సవాలలో భాగంగా శనివారం సత్యమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష అర్చనలు, కుంకుమార్చనలు, ఖడ్గమాల మూలమంత్ర హోమాది క్రతువులను అర్చకులు నందిగం సుబ్బారావు శాస్త్రి, కోటేశ్వరశాస్త్రి, టీటీడీ వేద పండితుడు దుర్భాకుల రఘునాథశర్మ అవధాని ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలు రకాల పుష్పాలు రంగురంగుల విద్యుద్దీప కాంతులతో సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై అమ్మవారిని ఉంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ గ్రామంలో కన్నుల పండువగా రథోత్సవాన్ని నిర్వహించారు. తొలుత నందిగామ ఏసీపీ తిలక్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. చండీ సహిత రుద్ర హోమం, గణపతి హోమం, వేదపారాయణ కార్యక్రమాలను వేదోక్తంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో హరిగోపీనాద్, ఉత్సవ కమిటీ సభ్యుడు మంచాల మాధవరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మైదానం మధ్యలో ఖోఖో కోర్టు ఏర్పాటు

పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని క్రీడామైదానం మధ్యలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ కోర్టుల ఏర్పాటు చేస్తుండటంతో క్రికెట్ ఆడేందుకు వీలులేకుండాపోయిందని క్రీడాకారులు వాపోతున్నారు. ఏటా వేసవి సెలవులు, సంక్రాంతి పండుగ సమయాల్లో గ్రామ క్రీడాకారుల ఆధ్వర్యంలో ఈ క్రీడామైదానంలో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తుంటారు.అయితే ఇటీవల ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకం కింద పాఠశాలలో రూ.5లక్షలతో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కోర్టులను క్రీడామైదానం మధ్యలో కాకుండా ఓ వైపున ఏర్పాటు చేసుంటే బాగుండేదని క్రికెట్ క్రీడాకారులు, అభిమానులు అభిప్రాయపడుతున్నారు. పాఠశాల క్రీడామైదానం మధ్యలో ఈ కోర్టులను ఏర్పాటు చేస్తుండటంతో భవిష్యత్‌లో క్రికెట్ పోటీల నిర్వహణకు అవకాశం లేకుండాపోయిందని క్రీడాకారులు చెబుతున్నారు. మండలం మొత్తంలో క్రికెట్ ఆడేందుకు ఉన్న ఏకైక క్రీడామైదానం ఇదేనని వారు పేర్కొంటున్నారు. ఇకనైనా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి క్రీడామైదానం మధ్యలో కాకుండా ఓవైపున ఈ ఖోఖో, కబడ్డీ కోర్టులు ఏర్పాటు చేయాలని క్రికెట్ క్రీడాకారులు కోరుతున్నారు.



కేవీఆర్ క్రీడా మైదానం మధ్యలో ఏర్పాటు చేస్తున్న కబడ్డీ, వాలీబాల్ కోర్టులు

పౌష్టికాహార ప్రాధాన్యంపై అవగాహన



పెనుగంచిప్రోలులో అవగాహన సదస్సులో పాల్గొన్న అంగన్‌వాడీలు, మహిళలు



కోనాయపాలెంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇష్రత్

పెనుగంచిప్రోలు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉషారాణి సూచించారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా శనివారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య విషయాలు, ఇంటిపనుల్లో భర్తలు సహకరించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు తగినంత విశ్రాంతి అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల. విమల, జయలక్ష్మి, సునీత, రాజ్యలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చందర్లపాడు మండలంలో..

చందర్లపాడు(నందిగామరూరల్): గర్భం దాల్చినప్పటి నుంచి ప్రతి మహిళ విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇష్రత్ సూచించారు. చందర్లపాడు మండలం కోనాయపాలెంలోని అంగనవాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పౌష్టికాహారం తీసుకుంటేనే బిడ్డ తాగే పాలలో కూడా పోషకాలుంటాయన్నారు. అంగనవాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు సునీత, నాగమణి, రత్నమ్మ, హైమావతి, వెంకట నర్సమ్మ, గర్భిణుల, బాలింతలు పాల్గొన్నారు.

నందిగామ పట్టణంలో..

నందిగామటౌన్: నందిగామ పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని అంగనవాడీ కేంద్రాలలో ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సీడీపీవో కృష్ణకుమారి ఆధ్వర్యంలో శనివారం పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలపై గర్భిణులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వెంకట్రావమ్మ, తారాబి, కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.